సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 3 । జూలై । 2023



నకిలీ విత్తనాలకు చెక్

వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లు రైతులకు ఆసరాగా నిలుస్తున్నాయి. ఎరువులు, విత్తనాల నాణ్యతను తెలుసుకోవచ్చు. - 8లో



పాన్‌షాపుల్లో తనిఖీలు

నరసన్నపేటలో పాన్‌షాపులు తనిఖీ చేశారు. గంజాయి విక్రయాలపై పోలీసులు దృష్టి సారించారు. - 8లో

జిల్లాలో 12 మంది ఎంఈఓల నియామకం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉమ్మడి శ్రీకాకుళంలో ఖాళీగా ఉన్న 12 ఎంఈఓ పోస్టులను భర్తీ చేశారు. జోన్–1 పరిధిలో శ్రీకాకుళం జిల్లాలో గార, బూర్జ, పాలకొండ, మందస, పొందూరు, పాతపట్నం, టెక్కలి, భామిని, రాజాం, వీరఘట్టం, కోటబొమ్మాళి, కొత్తూరు మండలాలకు సీనియర్ హెచ్‌ఎంలను ఎంఈఓలుగా నియమిస్తూ ఆర్‌జేడీ ఎం.జ్యోతి ఉత్తర్వులు వెలువరించారు.

న్యూస్‌రీల్

బస్ స్టేషన్లలో లీజుకు ఖాళీ స్థలాలు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ విజయనగరం జోన్ పరిధిలో శ్రీకాకుళం జిల్లాలో వివిధ బస్‌స్టేషన్లలో 5 ఖాళీ స్థలాలను 15 ఏళ్లకు లీజుకు ఇచ్చే ప్రాతిపదికన టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి విజయ కుమార్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం బస్ కాంప్లెక్స్‌లో బిట్–1, 667 చదరపు గజాలు, బిట్ –2, 7839 చదరపు గజాలు, సోంపేట బస్ స్టేషన్ పరిధిలో 774 చదరపు గజాలు, టెక్కలి బస్ స్టేషన్ పరిధిలో 17908 చదరపు గజాలు, ఆమదాలవలస పాత బస్‌స్టేషన్ పరిధిలో 9680 చదరపు గజాల ఖాళీ స్థలాలు లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. టెండర్ డాక్యుమెంట్లు, స్థలాల వివరాలు వాటికి సంబంధించిన డ్రాయింగ్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు తెలిపారు. బిడ్ సంబంధిత డాక్యుమెంట్లు ఈనెల 5వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆఫ్‌లైన్‌లో సమర్పించవచ్చునని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఔత్సాహిక వ్యాపారులు తమ బిడ్లు అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వారి కార్యాలయం, జోనల్ వర్క్ షాప్, వీటీ అగ్రహారం, విజయనగరం వద్ద ఖరారు చేయవచ్చని తెలిపారు. వివరాలకు డిప్యూటీ ఈఈ, శ్రీకాకుళం ఫోన్ నంబరు 9346045369 కు సంప్రదించవచ్చునని తెలిపారు.

'అన్న'మాట ప్రకారం..



రాజేశ్వరికి రూ.5వేల పింఛన్ అందజేస్తున్న మాజీ ఎంపీపీ యర్ర విశ్వశాంతి చక్రవర్తి

నందిగాం: నందిగాం మండలం దేవుపురం పంచాయతీ కొండతెంబూరుకు చెందిన కుదుమ శ్రీనివాస్, అన్నపూర్ణల కుమార్తె రాజేశ్వరి సెరిబ్రల్ వ్యాధితో బాధపడుతోంది. ఇటీవల జిల్లాకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సహాయంతో రాజేశ్వరి సమస్యను వివరించారు. తక్షణం స్పందించిన సీఎం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5లక్షలను మంజూరు చేసి కలెక్టర్ ద్వారా చెక్కు ఇప్పించారు. అలాగే రాజేశ్వరికి రూ. 5వేలు పింఛన్ మంజూరు చేయాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ నెల రాజేశ్వరికి పింఛన్ మంజూరైంది. మాజీ ఎంపీపీ యర్ర విశ్వశాంతి చక్రవర్తి ఆదివారం పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా పాప తల్లిదండ్రులు ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు.

ఒక్క రోజులో రూ.4.60 లక్షల ఆదాయం



సూర్య నమస్కార పూజలు

అరసవల్లి: అరసవల్లి సూర్యక్షేత్రం ఆదివారం భక్తులతో కళకళలాడింది. భక్తులు ఉదయం 6 గంటల నుంచే క్షేత్రానికి చేరుకుని తలనీలాలను సమర్పించుకుని స్నానాలు చేసి స్వామికి ప్రత్యేక ప్రసాదాలను నివేదించారు. అనంతరం విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనాల మార్గాల్లో భక్తులు దర్శనాలకు వెళ్లారు. ఇంద్రపుష్కరిణిలో నీరు లేని కారణంగా ప్రత్యామ్నాయంగా స్నానాల వినియోగానికి కుళాయిలను అందుబాటులో తెచ్చారు. అలాగే ఈసారి కూడా ఈశాన్య గేటు నుంచి దర్శనాలకు వచ్చేలా చర్యలు చేపట్టారు. ఆలయానికి ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చిన భక్తుల నుంచి దర్శనాల టిక్కెట్లు, పూజలు, విరాళాలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 4,60,869 వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తెలియజేశారు. దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,16,800, విరాళాలు, ఆర్జిత పూజల ద్వారా రూ.69,069, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,75 లక్షల వరకు ఆదాయం లభించినట్లు తెలిపారు.

చెరుకు మిషన్‌లోకి చున్నీ: యువతి మృతి

గార: శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథాలయం వద్దనున్న చెరుకు మిషన్ వద్ద పని చేస్తున్న గాయత్రి (18) అనే యువతి చున్నీ మిషన్‌లోకి వెళ్లిపోవడంతో ఊపిరాడక మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కంద్ర వీధికి చెందిన గాయత్రి ఆదివారం సాయంత్రం చెరుకు మిషన్ వద్ద పనిచేస్తూ ఉండగా ప్రమాదవశాత్తు చున్నీ మిషన్‌లోకి వెళ్లిపోయి ఊపిరాడక అపస్మారక స్థితికి వెళ్లిపోయింది. స్థానికులు హుటాహుటిన రిమ్స్‌కు తరలించినా అప్పటికే ఆమె మృతి చెందింది. ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు రిమ్స్ వైద్యులతో మాట్లాడారు.

అడ్డగోలు రాజకీయం

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏడో వార్డు పరిధిలో గల చినబడాం రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 81లో మాలబంద చెరువు నుంచి సరీయ గెడ్డకు వెళ్లే పొర్లు కాలువను టీడీపీ నాయకుడు బడ్డ నాగరాజు ఆక్రమించి, అనుమతి లేకుండా నిర్మించిన కల్వర్టు ఇది. ఈ కల్వర్టునే రహదారిగా చేసుకుని కార్యకలాపాలు సాగిస్తున్నారు. దీని వల్ల ఆ కాలువలో నీరు ప్రవహించడం లేదు. జంగిల్‌తో పాటు చెత్త చెదారం, పూడికలు పేరుకుపోయి నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. వంశధార ఆయకట్టుగా పరిగణిస్తున్నప్పటికీ సాగునీరు రాని పరిస్థితి. దీనిపై ఈనెల 26వ తేదీన స్థానికులు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దానిపై ఇరిగేషన్ అధికారులు పరిశీలన జరిపి, అక్రమంగా పొర్లు కాలువపై నిర్మాణం చేపట్టారని తేల్చారు. దీన్ని తొలగించాలని రెవెన్యూ అధికారులను లిఖిత పూర్వకంగా కోరారు. ఆ మేరకు రెవెన్యూ అధికారులు తొలగించేందుకు సిద్ధమవుతుండగా.. ఫిర్యాదు చేసిన రైతులపై టీడీపీ నాయకులు దాడికి దిగారు. స్థానిక నాయకులు సరిపోరని పలాస టీడీపీ ఇన్‌చార్జి గౌతు శిరీషతో పాటు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు హుటాహుటిన అక్కడికి చేరుకుని పార్టీకి జరగనున్న డ్యామేజ్‌ను కంట్రోల్ చేసేందుకు వితండవాదానికి దిగారు. ఆక్రమణ తొలగించేందుకు యత్నించిన అధికారులతో వాగ్వాదం చేయడంతో పాటు అడ్డు తగిలారు.





- ఆక్రమణలు కప్పిపుచ్చుకునేందుకు టీడీపీ ఎదురుదాడి
- ఆక్రమణలు తొలగిస్తున్న వారితో వితండవాదం
- ఫిర్యాదులు చేసిన రైతులపై దాడి, అధికారులను అడ్డుకుని వాగ్వాదం
- శాంతిభద్రతల సమస్యగా చిత్రీకరించే యత్నం
- నవ్విపోతున్న పలాస-కాశీబుగ్గ ప్రజలు



అన్నీ ఆక్రమణలే..

పలాసలో గత ప్రభుత్వంలో ఇక్కడ జరిగిన ఆక్రమణలు అన్నీ ఇన్నీ కావు. వీటిపైన పత్రికల్లో పతాక శీర్షికన అనేక సార్లు కథనాలు వచ్చాయి. టీడీపీ కీలక నేతలే ఆక్రమణలకు పాల్పడ్డారు. సర్వే నంబర్ల వారీగా వారి ఆక్రమణల చిట్టా పలాస-కాశీబుగ్గ ప్రజల వద్ద ఉంది. గతమంతా ఆక్రమణల మయమైనప్పటికీ నేడేదో ఆక్రమణలు జరిగిపోతున్నాయంటూ వితండవాదం చేసి ప్రజల్ని మభ్యపెడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ నేతలు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. తర్వాత ఆక్రమణలపై ఎవరైనా ఫిర్యాదులు చేసుకునే విధంగా ప్రజా దర్బార్ నిర్వహించారు. కానీ, టీడీపీ నాయకులు ఒక్కరు కూడా స్పందించలేదు. వాస్తవంగా ఈ ప్రభుత్వంలో ఆక్రమణలు జరిగితే ఫిర్యాదు చేసుకోవచ్చు. కానీ అలాంటి అవకాశం లేకపోవడంతో తోక ముడిచారు. సవాల్‌కు ప్రతి సవాల్ విసిరితే ఎక్కడ తమ ఆక్రమణలు బయటపడతాయని సైలెంట్ అయిపోయారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పలాస-కాశీబుగ్గలో అడ్డగోలు రాజకీయాలు జరుగుతున్నాయి. ఇదేమీ ఇక్కడ కొత్త కాదు. గత ఏడాది ఆగస్టులో కూడా ఇదే తరహా ఘటన చోటు చేసుకుంది. గురిటి సూర్యనారాయణ అనే టీడీపీ నాయకుడు చెరువు గర్భంలో నిర్మించుకున్న ఇళ్ల ఆక్రమిత స్థలాన్ని అధికారులు ఖాళీ చేసేందుకు యత్నించినప్పుడు కూడా ఇదే రకంగా గలాటా చేశారు. జిల్లా నాయకులు సరిపోరని ఏకంగా టీడీపీ అధినేత కొడుకు లోకేష్ కూడా వచ్చి హైడ్రామా నడిపించారు. తమకు ప్రజల్లో చెడ్డ పేరు వస్తుందన్న ప్రతి సందర్భంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. చేసిన తప్పులను కప్పు పుచ్చుకునేందుకు, ఆ తప్పు ప్రజల్లోకి వెళ్లకుండా గందరగోళానికి గురి చేసే ప్రయత్నం చేస్తున్నారు.

సాగునీరు రానందునే..

ఆయకట్టుకు నీరందడంలో ఇబ్బందులు ఏర్పడటం వలన స్థానికులే ఆక్రమణలపై ఫిర్యాదు చేస్తున్నారు. అందులో భాగంగా జూన్ 26వ తేదీన బడ్డ నాగరాజు ఆక్రమించుకున్న పొర్లు కాలువపై నిర్మించిన కల్వర్టుతో సాగునీటి సమస్య ఏర్పడిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో వంశధార ప్రాజెక్టు టెక్కలి డివిజన్ అధికారులు స్థానికంగా పరిశీలన చేసి, సమగ్ర విచారణ జరిపారు. దీంట్లో పొర్లు కాలువను ఆక్రమించి, అనుమతి లేకుండా కల్వర్టు కట్టారని తేల్చారు. దీని వల్లనే అక్కడ జంగిల్, పూడికలు పేరుకుపోయి సాగునీరు ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుందని గుర్తించారు. దీంతో 28న రెవెన్యూ అధికారులు లిఖితపూర్వకంగా రాసి, అక్కడున్న ఆక్రమణలు తొలగించాలని కోరారు. దానిలో భాగంగా 30వ తేదీ నుంచి ఆక్రమణలు తొలగించేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నారు. దానిలో భాగంగా శనివారం ఆక్రమణలు తొలగించేందుకు అక్కడికి రాగా, టీడీపీ నాయకులు అడ్డుకోవడమే కాకుండా ఫిర్యాదులు చేసిన వారిపై దాడికి దిగారు. తమ తప్పు బయట ప్రపంచానికి తెలియకూడదని విషయాన్ని రాద్ధాంతం చేసేందుకు యత్నించారు. టీడీపీ నాయకులే ఆక్రమణలకు పాల్పడ్డారని తెలిస్తే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని గ్రహించి ఎదురుదాడి చేయడం మొదలు పెట్టారు. ఫిర్యాదులు చేసిన వారిపై దాడి చేసి, ఆక్రమణలు తొలగించేందుకు యత్నించిన సిబ్బందిని అడ్డుకున్నారు. ఎక్కడైనా ఆక్రమణలు తొలగిస్తే ప్రజాప్రతినిధులు సమర్థించాలి. కానీ ఇక్కడ ఆక్రమణలు తొలగిస్తే టీడీపీ ప్రజా ప్రతినిధులు అడ్డుకుని, విషయాన్ని డైవర్ట్ చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నించారు. పలాసలో గత కొన్ని నెలలుగా ఇదే రకంగా జరుగుతోంది.



ఆక్రమించి, కల్వర్టు నిర్మించడంతో పూడికలు పేరుకుపోయి ఉన్న పొర్లు కాలువ



శనివారం రాత్రి ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

రైతుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపాం

పొర్లు కాలువ ఆక్రమించి, అనుమతి లేకుండా కల్వర్టు నిర్మించినట్టు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక రైతుల నుంచి ఫిర్యాదు వచ్చింది. దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమగ్ర విచారణ జరిపాం. రికార్డులను పరిశీలించి, ఎలాంటి అనుమతి లేకుండా పొర్లు కాలువపై అక్రమంగా కల్వర్టు నిర్మించారని గుర్తించాం. ఈ కల్వర్టు వల్ల సాగునీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీన్ని తొలగించాలని రెవెన్యూ అధికారులను లిఖిత పూర్వకంగా కోరాం.

– కొత్తకోట శ్రీకాంత్, వంశధార టెక్కలి డివిజన్ ఇన్‌చార్జి ఈఈ.

ఆక్రమణలు తొలగిస్తే రాజకీయం చేస్తున్నారు

మాలబంద చెరువు నుంచి సరీయ గెడ్డకు వెళ్తున్న పొర్లు కాలువ ఆక్రమించిన విషయం మా దృష్టికి వచ్చింది. సాగునీటి ఇబ్బందుల దృష్ట్యా తొలగించాలని వంశధార అధికారులు లిఖిత పూర్వకంగా కోరారు. ఆ మేరకు శనివారం తొలగించేందుకు ప్రయత్నిస్తుండగా కొంతమంది వచ్చి రాజకీయం చేస్తూ అడ్డు తగిలారు. అక్రమాలు ఎవరు చేసినా తొలగిస్తాం.

– లంబాల మధుసూధనరావు, తహసీల్దార్, పలాస.

ఇదీ మార్పు అంటే

రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఇన్నాళ్లూ కాని పనులు ఇప్పుడు చిటికెలో అయిపోతున్నాయి. పత్రాల కోసం అధికారుల కోసం పడిగాపులు కాసే రోజులు పోయి ఇంటికే సర్టిఫికెట్లు తీసుకువచ్చే రోజులు వచ్చాయి. జగనన్న సురక్ష కార్యక్రమం పల్లెల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డుల్లో మార్పులు వంటివి చాలా సులభంగా జరుగుతూ.. ప్రభుత్వ వ్యవస్థను ప్రజల చెంతకు చేరుతోంది.

– నరసన్నపేట, ఆమదాలవలస రూరల్, కంచిలి



ఒక్క రోజులోనే కుల ధ్రువీకరణ పత్రం



ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు గురుగుబెల్లి గోవిందమ్మ. ఆమదాలవలస మండలం తొగరాం గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఈమె ఈ ఏడాది వైఎస్సార్ చేయూత పథకానికి అర్హత పొందుతున్నారు. అయితే కుల ధ్రువీకరణ పత్రం అవసరం ఉన్నందున వలంటీర్ దరఖాస్తు చేయించారు. దరఖాస్తు చేసిన ఒక్క రోజులోనే శనివారం జగనన్న సురక్ష క్యాంపులో ఈ పత్రాన్ని తీసుకున్నారు. గతంలో కుల ధ్రువీకరణ పత్రం పొందాలంటే మండల కేంద్రం చుట్టూ నెలల తరబడి తిరిగితే వచ్చేది. ఒక్క రోజులోనే తన చేతికి ధ్రువపత్రం రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అంత తొందరగా..



ఈమె పేరు కింజరాపు శ్రావ్య. నరసన్నపేట మండలం తామరాపల్లి గ్రామం. ఈమె వద్దకు వలంటీర్ వెళ్లి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేయించారు. ఇదివరకు ఈ సర్టిఫికెట్లు కావాలంటే దాదాపు మూడు రోజుల సమయం పట్టేది. కానీ ఇప్పుడు వలంటీర్ సర్టిఫికెట్లు నేరుగా ఇంటికే తీసుకెళ్లి ఆమెకు అందించారు. దీంతో ఆమె ఆశ్చర్యపోయారు.

చిటికెలో పరిష్కారం..



చిత్రంలోని వ్యక్తి పేరు బొడ్డ నరసయ్య. కంచిలి మండలం పెద్దకొజ్జిరియా గ్రామం. రేషన్ కార్డులో మార్పు కోసం చాలాకాలంగా ప్రయత్నిస్తున్నారు. జగనన్న సురక్ష ద్వారా ఈ పని సులభంగా పూర్తయ్యింది. కార్డు స్పిట్ కావడంతో కొత్త కార్డు రావడానికి అవకాశం ఏర్పడింది. దీంతో ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

ఉద్యమాల గడ్డ సిక్కోలు

- సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి



బూరగాంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి

కంచిలి: ఉద్యమాలకు పురిటి గడ్డ.. సిక్కోలు అని సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని బూరగాం గ్రామంలో స్థానిక జైభీమ్ చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు కొక్కిరి రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. అదేవిధంగా విజ్ఞాన మందిర్‌ను రిటైర్డు ఐఏఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ జిల్లా ఉద్యమాలకు పుట్టినిల్లు అని, ఇటీవలే సోంపేట థర్మల్ ప్లాంట్ విషయంలోనూ ఉద్యమాలు చేశారని అన్నారు. అనంతరం అంబేడ్కర్ గొప్పదనాన్ని వివరించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రిజర్వేషన్ల వ్యవస్థను తీసుకొచ్చేలా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఈ దేశంలో కుల వివక్ష అనేది పూర్తిగా పోతేనే దేశం అభివృద్ధి చెందుతుందని సినీ గేయ రచయిత, ప్రజాకవి జయరాజ్ పేర్కొన్నారు. సమాజంలో కుల వ్యవస్థ రాజ్యమేలినన్ని రోజులు అభివృద్ధి అనేది కానరాదన్నారు. ప్రకృతి వనరుల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైగా ఉందన్నారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని రిటైర్డు ఐఏఎస్ అధికారి పి.ఎస్.ఎన్. మూర్తి అన్నారు. ఆర్థిక ప్రణాళిక, ఆర్థిక ప్రజాస్వామ్యం వంటివి ఏర్పాటు చేయడంతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు.

కార్యక్రమంలో రిటైర్డు ఐఏఎస్ అధికారి రుంకు అప్పారావు, శ్రీశైలం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాస్టీల శ్రీనివాసరావు, మిస్క కృష్ణయ్య, కల్లేపల్లి రామ్‌గోపాల్‌రావు, స్థానిక సర్పంచ్ బి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో చరణ్‌దీప్‌కు కార్పొరేట్ వైద్యం

బీద కుటుంబానికి చెందిన కొండక చరణ్‌దీప్ వైద్యానికి దాతలు సహాయం చేస్తున్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతూ అనారోగ్యానికి గురైన చరణ్‌దీప్ ప్రస్తుతం రాయవెల్లూరులో చికిత్స పొందుతున్నాడు. గత నెల 21న సాక్షిలో 'దాతలే దిక్కు' అనే శీర్షికన విద్యార్థి పరిస్థితిపై కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఎంతో మంది దాతలు స్పందించి ఆర్థిక సాయం చేశారు. ఇప్పటి వరకు రూ.3 లక్షలకు పైగా సాయం అందిందని విద్యార్థి తండ్రి ఆదినారాయణ తెలిపారు. స్టేట్‌బ్యాంకు మేనేజర్ సూర్యప్రకాశ్ రూ. 20 వేలు, ఊణ్ణ శేషు రూ. 25 వేలు, నరసన్నపేటకు చెందిన సాహూ రూ. 5000, కొత్తపేటకు చెందిన కోరాడ సుబ్రహ్మణ్యం రూ. 5000, చల్లవానిపేట ఇందిరా నగర్ కాలనీకి చెందిన వారు రూ. 51 వేలు, దరివాడ హెల్పింగ్స్ హేండ్స్ ఆధ్వర్యంలో రూ. 55 వేలు, చల్లపేట స్టేట్‌బ్యాంకు సిబ్బంది, వరసరాల షాపులకు చెందిన వారు రూ. 42 వేలు, వీరు కాకుండా మరో రూ. 60 వేలు దాతలు పంపారని ఆదినారాయణ తెలిపారు. అలాగే విజయవాడకు చెందిన డాక్టర్ విజయ్ ముందుకు వచ్చి వైద్య పరంగా తగు సూచనలు, సలహాలు ఇస్తున్నారని తెలిపారు. తన కుమారుడి పరిస్థితి ఇంకా మెరుగుపడలేదని, డాక్టర్లు వైద్యం అందిస్తున్నారని చెప్పారు. దాతలు సాయం చేయడం వల్లనే వైద్యం చేయించగలుగుతున్నామని తెలిపారు. – నరసన్నపేట



రాయవెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చరణ్‌దీప్



పరిమళించిన మానవత్వం

మండలంలోని మాణిక్యపురానికి చెందిన గోపీచంద్ర సాహు టర్కీలోని ఓ ప్రైవేట్ కంపెనీలో సుదీర్ఘకాలం పనిచేశారు. ఇటీవల తీవ్ర అనారోగ్యంతో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో ఆయన తోటి ఉద్యోగులు రూ.8 లక్షలు సేకరించి గోపీచంద్ర కుటుంబానికి అందజేశారు. ఈ మొత్తాన్ని పీఏసీఎస్ చైర్మన్ దేవరాజ్‌సాహు, సంతోష్‌సాహు, డిల్లీ మజ్జీ తదితరుల సమక్షంలో అందించారు. సంస్థ ఆ కుటుంబంపై చూపిన ఉదారతకు సర్పంచ్ లలితా సాహు, ఎంపీటీసీ సరస్వతి సాహు కృతజ్ఞతలు తెలిపారు. – కవిటి

ఏపీఈసెట్‌లో సిక్కోలు సత్తా



రైవాడ ఢిల్లీశ్వరి

పాతపట్నం: ఏపీఈ సెట్‌లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాతపట్నం పిల్లివీధికి చెందిన రైవాడ ఢిల్లీశ్వరి మొదటి ర్యాంకు కైవసం చేసుకుంది. 200 మార్కులకు గాను 117 మార్కులు సాధించి సత్తాసాటింది. ఈమె పదో తరగతి విక్టరీ పాఠశాలలో చదివింది. అనకాపల్లి ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ ఇంజినీర్ డిప్లమా చదివింది. తండ్రి రైవాడ కృష్ణారావు విక్టరీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి రైవాడ లలిత గృహిణి. ఈ సందర్భంగా ఢిల్లేశ్వరీ మాట్లాడుతూ అగ్రికల్చర్ సైంటిస్ట్‌గా పనిచేయాలన్నది తన ధ్యేయమని తెలిపారు.

మెరిసిన చిరు వ్యాపారి కుమార్తె



తంగుడు హరిణి

సారవకోట: మండల కేంద్రానికి చెందిన చిరు వ్యాపారి తంగుడు ఆనందరావు కుమార్తె తంగుడు హరిణి ఆదివారం విడుదలైన ఏపీఈసెట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించింది. జూన్ 20న జరిగిన ఏపీఈసెట్ ప్రవేశ పరీక్షలలో అగ్రికల్చర్ ఇంజినీరింగ్ విభాగంలో పరీక్షకు హాజరైంది. 200 మార్కులకు గాను 115 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించింది. భవిష్యత్‌లో తాను వ్యవసాయ శాస్త్రవేత్త కావాలని కోరుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఆమెకు ఉత్తమ ర్యాంకు రావడంతో తల్లిదండ్రులు భ్రమరాంబ, ఆనందరావులు సంతోషం వ్యక్తం చేశారు.

సత్తా చాటిన ఆశ్రిత



పురట ఆశ్రిత

నందిగాం: మండలంలోని లఖిదాసుపురానికి చెందిన పురట ఆశ్రిత ఏపీ ఈసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. ఆదివారం విడుదలైన ఫలితాల్లో 110 మార్కులు సాధించి 7వ ర్యాంకు కైవసం చేసుకుంది. ఆశ్రిత తండ్రి మల్లేశ్వరరావు హెచ్‌డీఎఫ్‌సీ శ్రీకాకుళం బ్యాంచ్ మేనేజరుగా పనిచేస్తుండగా తల్లి రజిని కుమారి గృహిణి. కుమార్తె ప్రతిభపై వారు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే భవిష్యత్‌లో ఎంటెక్, పీహెచ్‌డీ చేసి వ్యవసాయ శాస్త్రవేత్త అయి రైతులకు సేవ చేయాలని ఉందని ఆశ్రిత తెలిపారు.

ఈసెట్ ఫలితాల్లో 905 మంది అర్హత

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ ఈసెట్ ఫలితాల్లో సిక్కోలు విద్యార్థులు రాణించారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలకు 1009 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా ఈ పరీక్షకు 980 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 905 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఇందులో బాలికలు 95 శాతం, బాలురు 91.18 శాతం ఉన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


విరాళ నగదును అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ నిత్యాన్నదాన పథకానికి ఆమదాల వలస (తిమ్మాపురం)కు చెందిన బొడ్డేపల్లి వెంకునాయుడు తన భార్య తులసమ్మ జ్ఞాపకార్థం రూ.1,01,111 విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆదివారం ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలకు విరాళ నగదు అందించారు. దాతలకు పర్వదినాల్లో విశిష్ట దర్శనం కలిపిస్తామని, ఇందుకోసం ప్రత్యేక డోనర్ పాసులు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం


తెరవే ఆధ్వర్యంలో కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రయిచతల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం 82వ నెలవారీ సాహితీ సమ్మేళనం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు ఉత్తరావల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎన్‌డీ ప్రసాద్ (దగాపడ్డ తమ్ముళ్లు), పి.వి. దుర్గాప్రసాద్ (అదే రహదారి), ఎం.శ్రీనివాసరావు (భారత స్వాతంత్ర్య స్ఫూర్తిదాతలు), యు.నాగేశ్వరరావు (అప్పులు తెచ్చిన తిప్పలు), టి.ఎర్రమ్మ (గరిమెళ్ల గర్జన), ఆర్.వి.రమణమూర్తి (ప్రజాకవి గరిమెళ్ల), కె.పేర్రాజు సిరికి స్వామినాయుడు మట్టి రంగు బొమ్మలు పుస్తక సమీక్ష, భోగెల ఉమాకవి (తల్లి నిన్నుతలచి), ఎస్.ఈశ్వరరావు(ఏమైపోతున్నాయో), పత్తి సుమతి (విప్లవ కారులు) కవితలను చదివారు.

పాన్‌షాపుల్లో తనిఖీలు


తనిఖీలు చేస్తున్న పోలీసులు

నరసన్నపేట: గంజాయి, ఇతర నిషేధిత వస్తువులు విక్రయాలు చేస్తున్నారనే అనుమానంతో నరసన్నపేటలోని పలు పాన్‌షాపుల్లో సీఐ డి.రాము, పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఆదివారపుపేట, దేశవానిపేట, వీరన్నాయుడు కాలనీతో పాటు పట్టణ శివారుల్లో షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, ఖైనీ, గుట్కా వంటి నిషేధిత పదార్థాలు అక్రమంగా నిల్వ చేసినా, విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్‌ఐ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన పాసింజర్ రైలు


పాసింజర్ రైలులో రద్దీ

కాశీబుగ్గ: పలాస నుంచి విశాఖ వెళ్లే పాసింజర్ రైలు ఆదివారం ప్రయాణికులతో కిక్కిరిసింది. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న గిరిప్రదక్షిణకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరుకావడంతో భోగీలన్నీ ప్రయాణికులతో నిండిపోయాయి.

నకిలీ విత్తనాలకు చెక్!

- రైతులకు ఆసరాగా డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు
- ఎరువులు, విత్తనాల నాణ్యతను ముందుగానే తెలుసుకునే అవకాశం
- జిల్లాలో ఏడు సబ్ డివిజన్లలో ఏర్పాటు

అగ్రి ల్యాబ్‌లో ప్రైవేటు వ్యక్తులకు పరీక్ష రుసుములు ఇలా..

పరీక్షపేరు	చెల్లించాల్సిన ధర
విత్తనం మొలకశాతం	రూ.200
విత్తనం నాణ్యాత	రూ.50
విత్తనం తేమశాతం	రూ.50
ఎరువుల్లో ఒక పోషకం	రూ.1000
రెండో పోషకాలు	రూ.2000
మూడో పోషకాలు	రూ.2500
ఒక్కొక్క సూక్ష్మధాత పోషణకు	రూ.750


రణస్థలంలో డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్

జి.సిగడాం: రైతులు నకిలీ విత్తనాలు, ఎరువులతో మోసపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఏ ఒక్క రైతూ నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు వినియోగించి నష్టపోకూడదని భావించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సబ్ డివిజన్‌కు టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. అగ్రిటెస్టింగ్ ల్యాబ్ భవన నిర్మాణానికి రూ.60 లక్షలు, వాటిలో నాణ్యమైన పరికరాలు ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.70లక్షలు చొప్పున వెచ్చించారు. మొత్తం రూ.కోటీ 30 లక్షలు ఖర్చు చేశారు. ఈ ల్యాబ్ ద్వారా వివిధ రకాల విత్తనాల మొలక శాతం, తేమతోపాటు విత్తనాల నాణ్యతను తనిఖీ చేస్తారు. పశువులకు వచ్చే వ్యాధులపై తనిఖీ చేసేందుకు సేకరించిన నమూనాలను సైతం ఇక్కడ పరీక్షిస్తారు.

ఏడు సబ్ డివిజన్‌లలో ల్యాబ్‌లు

జిల్లాలోని రణస్థలం, శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, సోంపేట, పలాస, కొత్తూరులో డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో విత్తనాలు, ఎరువులు తనిఖీ చేయించుకుంటే సాగు చేస్తున్నప్పుడు రైతులకు ఎటువంటి సమస్యా ఎదురుకాదు. ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలే కాకుండా ప్రైవేటు షాపుల్లో కొనుగోలు చేసేవి, రైతులు సొంతంగా పండించుకునే విత్తనాలు, ప్రైవేటు డీలర్లు సైతం ఇక్కడ విత్తనాలను పరీక్షించుకునే సౌలభ్యం ఉటుంది. ఇందుకోసం కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది.


విత్తనాలను పరీక్షిస్తున్న అనలిస్ట్ సుహాసిని

రైతులకు ఉచితం



పంట సాగు చేసేందుకు రైతు తీసుకువచ్చిన విత్తనాలు, ఎరువులను ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షిస్తాం. ప్రయివేట్ డీలర్లు గాని స్వచ్ఛంద సంస్థల ద్వారా తీసుకుచ్చిన వాటిపై ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించాలి. తనిఖీ చేసిన ఫలితాలను 10 నుంచి 15 రోజుల్లో రైతుకు అందిస్తాం.

– వద్దాది శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ ఏడీఏ రణస్థలం

వినియోగించుకోవాలి



విత్తనాలు, ఎరువులు నాణ్యతా ప్రమాణాలు పరీక్ష చేయించుకోవాలనే రైతులు ఆర్‌బీకేలో పని చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బందిని కలవాలి. వారు ల్యాబ్ అనలిస్టలతో మాట్లాడి అవసరమై పరీక్షలు చేయిస్తారు. ఇటువంటి సేవలను రైతులు వినియోగించుకోవాలి.

– విజయభాస్కర్, మండల వ్యవసాయాధికారి, రణస్థలం

కచ్చితమైన ఫలితాలు



రైతులు తీసుకువచ్చిన విత్తనాలు, ఎరువుల్లో నాణ్యతా ప్రమాణాలు, తేమ, మొలక శాతం సమర్థంగా పరీక్షిస్తాం. దీనివల్ల రైతులు సాగు సమయంలో ఇబ్బందుల నుంచి తప్పించుకోవచ్చు. రైతులు నమూనాలు అందజేసిన 10 –15 రోజుల్లో ఫలితాలను అందిస్తాం.

– జి.సుహాసిని, డాక్టర్ వైఎస్సార్ అగ్రిలాబ్ అనలిస్ట్ ఏఓ, రణస్థల

50 వేల ఎకరాల్లో యాంత్రీకరణ సాగు లక్ష్యం


యాంత్రీకరణ ద్వారా వెద సాగు చేస్తున్న దృశ్యం

జి.సిగడాం : డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిధిలోని 25 మండలాల్లో 50 వేల ఎకరాల్లో యాంత్రీకరణ పంటల సాగు చేయించడం లక్ష్యమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. ఆదివారం జి.సిగడాం మండలం పాలఖండ్యాం, సంతవురిటి, పెంట గ్రామాల్లో సుమారు 60 ఎకరాల పొలంలో యంత్రం సాయంతో వెదసాగు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపాతం తక్కువ కారణంగా యంత్ర సాగు ద్వారా వెద సాగు చేసుకుంటే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించగలమన్నారు. సాగునీరు కూడా ఆదా చేయవచ్చున్నారు. ఎకరాకు 12–13 కేజీల వరి విత్తనాలు అవసరమవుతాయని చెప్పారు. యంత్రాలను అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు 9985542547 నంబరుకు సంప్రదించాలన్నారు. 38 శాతం రాయితీపై యంత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ లక్ష్మీనరసింహమూర్తి, సమన్వయకర్త ఆకిరి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంజీఆర్ పుట్టినరోజు వేడుకలు


మాట్లాడుతున్న మామిడి గోవిందరావు

పాతపట్నం: పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఆదివారం తామర గ్రామానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త మామిడి గోవిందరావు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ముందుగా నీలమణిదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారి మీదుగా ఆస్పత్రి కూడలి, మార్కెట్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పైల బాబ్జీ, యాళ్ల నాగేశ్వరరావు, వెలమల గోవిందరావు, నంబాల వెంకటరమణ, ఎద్దు దాసునాయుడు, శంకరరావు తదితరులు పాల్గొన్నరు.

హౌస్ సర్జన్ ఆత్మహత్య

- పెనరపాడులో విషాదఛాయలు


చైతన్య మృతదేహం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 6వ వార్డు పెనరపాడు గ్రామానికి చెందిన పాలవలస చైతన్య(24) అనే హౌస్ సర్జన్ ఆదివారం నెల్లూరులో ఆత్మహత్య చేసుకుంది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్య ఎంబీబీఎస్ పూర్తి చేసి నెల్లూరు జిల్లా నారాయణ మెడికల్ కళాశాలలో హౌస్ సర్జన్‌గా పనిచేస్తోంది. అదే కళాశాల వసతి గృహంలో నివాసముంటోంది. ఈమెకు ఈ ఏడాదిమార్చి 8న నందిగాం మండలం ప్రతాప విశ్వనాథపురం గ్రామానికి చెందిన బమ్మిడి శరత్‌కుమార్ అనే ఆర్థోపెడిక్ వైద్యునితో వివాహం జరిగింది. ఏం జరిగిందో ఏమో గానీ ఆదివారం తాను ఉంటున్న హాస్టల్ గదిలోనే చైతన్య ఆత్మహత్య చేసుకుంది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ భర్త కారణంగానే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని చెప్పారు. కాగా, మృతురాలు తల్లి పాలవలస జ్యోతి వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నారు. తండ్రి ఆర్మీలో ఉద్యోగం చేసి చిన్నతనంలో మృతి చెందారు. చైతన్య మృతదేహాన్ని సోమవారం పలాసకు తీసుకువచ్చే అవకాశం ఉంది.

కాలువ ఆక్రమించి రైతులపై దాడులా?

- టీడీపీ నేతల తీరుపై వైఎస్సార్ సీపీ నాయకుల మండిపాటు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాశీబుగ్గ: కాలువను ఆక్రమించి రైతులపై దాడులు చేయడం ఎంతవరకు సమంజమని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ప్రశ్నించారు. ఆదివారం చినబడం బస్టాండ్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని రాజకీయాలు చేయాలన్నారు. ప్రాంతాలు, ప్రజల మధ్య గొడవలు పెట్టే రీతిలో టీడీపీ నాయకురాలు గౌతు శిరీష మాట్లాడటం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న కుటుంబం నుంచి వచ్చినా మంత్రిపై మాట్లాడుతున్న తీరును చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారని చెప్పారు. టీడీపీ నేత బడ్డ నాగరాజు కాలువను ఆక్రమించుకుని రహదారి నిర్మించుకుంటే పంట పొలాలకు నీరు ఎలా వెళ్తుందో చెప్పాలని శిరీషను సూటిగా ప్రశ్నించారు. వాస్తవాలు గమనించలేని స్థితిలో ప్రతిపక్ష నాయకులు ఉన్నారని మండిపడ్డారు. ఇతర నియోజకవర్గం నుంచి నాయకులను రప్పించి పలాసలో అల్లర్లు సృష్టించాలని చూస్తే తీవ్రస్థాయిలో ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. శనివారం రాత్రి అధికారులు కల్వర్టు ఆక్రమణ తొలగించాలని వెళ్తే అధికారులను బెదిరించి చంపేస్తాం పొడిచేస్తాం అంటూ పిచ్చి ప్రేలాపన చేయడం తగదన్నారు. రైతుల ఆలోచనలు, ఆవేదనలు వేరేగా ఉంటాయని, వారి బాధలను అర్థం చేసుకుని మెలగాలని హితవుపలికారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, కౌన్సిలర్ దువ్వాడ రమణయ్య, డిక్కల నిరంజన్, అట్టా మోహనరావు, మాదిన వెంకటరావు, కూర్మాపు సుందరరావు, ధర్మారావు, డిక్కల లక్ష్మణరావు, బడగల బల్లయ్య, అంబటి ఆనంద్, డబ్బీరు భవానీ, దుర్గా శంకర్‌పండా, బమ్మిడి సంతోష్, పప్పల ప్రసాద్, గౌరీత్యాడి తదితరులు పాల్గొన్నారు.

యాదవ సామాజికవర్గానికి సముచిత గౌరవం


ఎమ్మెల్సీ నర్తు రామారావు, సమన్వయకర్త సాయిరాజ్‌లను సన్మానిస్తున్న దృశ్యం

కవిటి : అణగదొక్కబడిన తమ సామాజికవర్గానికి చెందిన బీసీ నేత నర్తు రామారావుకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తమ పట్ల చూపిన ఆదరణ యాదవసామాజిక వర్గానికి దక్కిన గౌరవమని వక్తలు కొనియాడారు. కవిటి మండలం జాడుపుడి ఆర్ఎస్‌లో జి.బెలగాం గ్రామస్తుల ఆధ్వర్యంలో మద్దిలి ఈశ్వరరావు అధ్యక్షతన ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ నాలుగు మండలాల ప్రజాప్రతినిధులకు పౌరసన్మాన సభ నిర్వహించారు. ముందుగా రామారావు, సాయిరాజ్‌లను సత్కరించి జ్ఞాపికల్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెలగాం పంచాయతీ అభివృద్ధికి చిత్తశుద్ధితో ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు పైల దేవదాస్ రెడ్డి, బోర పుష్ప, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీదివ్య, డాక్టర్ కోదండరాం, కడియాల ప్రకాష్, ఏఎంసీ చైర్మన్లు బదకల మోహనరావు, ఎస్.బాబూరావు, వైస్ చైర్మన్ వై.నీలయ్య, పీఏసీఎస్ చైర్మన్ గుమ్మడి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరువీధి


తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం


కోలాటం చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలో షిరిడిసాయి తత్త్వ ప్రచారం మందిరం ఆధ్వర్యంలో జరుగుతున్న గురు పౌర్ణమి వేడుకలలో భాగంగా ఆదివారం తిరువీధి ర్యాలీ నిర్వహించారు. గ్రామ పురోహితులు భాస్కర భట్ల చంద్రశేఖరశర్మ, రాజేష్‌శర్మల ఆధ్వర్యంలో కోటిలిఖిత నామ జపం పుస్తకాలతో మేళతాళాలు, కోలాటంతో అత్యంత వైభవంగా కార్యక్రమం నిర్వహించారు.

9న 'మన కోసం మనసభ'


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గుంటూరులో ఈ నెల 9న జరగనున్న మన కోసం మన సభను విజయవంతం చేయాలని శ్రీకాకుళం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కిల్లాన భోజ్‌కుమార్, సోషలిస్ట్ థింకర్స్ ఫోరమ్ రాష్ట్ర ప్రతినిధి ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్, అఖిల భారతీయ యాదవ మహాసభ(అహీర్) జిల్లా అధ్యక్షుడు గదిబోయిన కృష్ణయాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలో వాల్ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ చేతుల మీదుగా ములాయం సింగ్ యాదవ్ విగ్రహావిష్కరణ, భారీ బహిరంగ సభ జరుగుతుందని వివరించారు. పార్టీలకతీతంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అహీర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి రాము యాదవ్, యాదవ సంఘం నాయకులు కిల్లాన శ్రీనివాసరావు, వంజరాపు రాజు, బత్తుల మురళీమోహన్, కెల్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నైవేద్యానికి నిధుల కేటాయింపుపై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న సింహాద్రి ధనుంజయాచారి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయాల్లో ధూపదీప నైవేద్యాల నిమిత్తం నెలకు రూ.5 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం జీవో విడుదల చేయడం హర్షణీయమని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి ధనుంజయాచారి అన్నారు. శ్రీకాకుళం కంపోస్టుకాలనీలో ఆదివారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల్లో 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ మంజూరు చేయాలని కోరారు. వర్కింగ్ షెడ్ల నిర్మాణానికి సహకారం అందించాలని, దేవాలయ పాలక మండలి సభ్యుల్లో విశ్వ బ్రాహ్మణ సామాజికవర్గానికి కూడా చోటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు టేకి సూర్యకుమారి, సెక్రటరీ దేవరకొండ షణ్ముఖరావు, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ మంతిన హరినాథరావు, గౌరవ అధ్యక్షుడు సింహాద్రి గోపాలకృష్ణ, నల్లబాటి కృష్ణ, అనుపోజు శ్రీధర్, అంట్లూరి గణ, పొన్నాడ రమణ పాల్గొన్నారు.

13న తలనీలాల వేలం

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలను ఈ నెల 13న మధ్యాహ్నం మూడు గంటలకు బహిరంగ వేలం వేయనున్నామని ఈవో టి.వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, దేవదాయశాఖ అధికారులు సమక్షంలో వేలం జరుగుతుందని, ఆసక్తి గల వారు రూ. 2 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఐక్యపోరాటాలే శరణ్యం


సమావేశంలో మాట్లాడుతున్న పి.ఓ.డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పి.కుసుమ

పలాస: దేశం, రాష్ట్రంలో ప్రజల కోసం గొంతుకలై మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులపై ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని, 152 మందిపై పెట్టిన ఉపా కేసులను ఉపసంహరించుకోవాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఐక్య పోరాటాల ద్వారానే ప్రభుత్వాల నిర్బంధాలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద ఆదివారం రౌండు టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పి.ఓ.డబ్ల్యూ జిల్లా కార్యదర్శి పి.కుసుమ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామ్రెడ్ సంధ్యకు మావోయిస్టు అనుబంధ సంస్థలతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ అక్రమంగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కేసులు ఎత్తివేయాలని కోరారు. సమావేశంలో సి.పి.ఐ.ఎం.ఎల్. లిబరేషన్ సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, పి.కె.ఎస్.జిల్లా అధ్యక్షుడు పుచ్చ దుర్యోధన, అమరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర నాయకుడు జోగి కోదండరావు, సి.పి.ఐ.ఎం.ఎల్. న్యూడెమోక్రసీ జిల్లా సహాయక కార్యదర్శి గొరకల బాలకృష్ణ, పి.డి.ఎం.జిల్లా కార్యదర్శి సాలిన వీరాస్వామి, తామాడ సన్యాసిరావు, నాగమణి, తామాడ త్రిలోచనరావు, దాసరి శ్రీరాములు, కుత్తుం దుష్యంతు, ఢిల్లీరావు, కుత్తుం హేమ, ఆర్.మాధవరావు, గురయ్య తదితరులు పాల్గొన్నారు.

8న కలెక్టరేట్ వద్ద ధర్నా


మాట్లాడుతున్న కరిమి రాజేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో ఈ నెల 8న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం ఎన్‌జీవో కార్యాలయంలో ఆదివారం ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో ధర్నా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూజీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పొందూరు అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్, సీపీఎస్ కన్వీనర్ జి.నారాయణరావు, ఏపీటీఎఫ్ 257 నవీన్, రామ్మోహన్‌రావు, ఏపీటీఎఫ్ 1938 టెంక చలపతిరావు, పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి దానేటి కేశవ, ఎస్ఎల్‌టీఏ అధ్యక్షుడు పి.వసంతరావు, ఎస్‌జీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.ధనుంజయరావు, ఏపీసీపీఎస్ఈఏ నాయకులు చల్లా దుర్గాప్రసాద్, తూముల సూర్యారావు, ఎ.భాస్కర్, రెడ్డి సూరిబాబు, ఎండ ఉమా శంకర్, పురుషోత్తం, శరత్ పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59070–00
బంగారం(22సి. 10గ్రా.)	54,150–00
వెండి (కిలో)	75,700–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹132	₹234	₹ 244